క్లుప్తంగా

ఘనంగా తీజ్ పండుగ



తీజ్ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

మోతె : మండలంలోని కూడలితండాలో తీజ్ పండుగను సోమవారం గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజుల పాటు నీరు పోసి పెంచిన గోధుమ నారును యువతులు బుట్టలలో పెట్టి ప్రదర్శనగా వెళ్లి వనదేవతకు సమర్పిస్తారు. సర్పంచ్ పానుగోటి నర్సింహారావు, రవి, జేతు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి బహూకరణ



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న మైహోం పరిశ్రమ హెడ్ శ్రీనివాసరావు

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం సమీపంలో గల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు మైహోం సిమెంట్స్ పరిశ్రమకు చెందిన శ్రీలేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.30 వేల విలువ గల క్రీడా సామగ్రిని సోమవారం పరిశ్రమ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, క్లబ్ ప్రెసిడెంట్ అనురాధ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మౌనిక, శ్రీలక్ష్మి, వసంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మఠంపల్లి అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం

మఠంపల్లి గ్రామ అభివృద్ధికి మైహోం సిమెంట్స్ పరిశ్రమ నుంచి రూ.10 లక్షల చెక్కును సోమవారం పరిశ్రమ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డికి స్థానికంగా అందజేశారు. పలువురు పరిశ్రమ ఉద్యోగులు ఉన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు బట్టు మధు, సుంకరి క్రాంతికుమార్, సూరిబాబు, రంగారెడ్డి, విశ్వనాథం, ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయురాలు అనసూర్య తదితరులు ఉన్నారు.

పేదలకు అండగా 'ఓజో ఫౌండేషన్'



కామ్యానాయక్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఓజో ఇన్‌చార్జ్ వెంకన్న

మఠంపల్లి : సామాజిక సేవా కార్యక్రమాలతో నియోజకవర్గంలోని పేదలకు ఓజో ఫౌండేషన్ అండగా నిలుస్తోందని ఓజో ఫౌండేషన్ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న అన్నారు. మండలంలోని భీమ్లాతండాలో ఇటీవల మృతి చెందిన నిరుపేద పానుగోతు కామ్యానాయక్ కుటుంబానికి ఓజో చైర్మన్ పిల్లుట్ల రఘు ఆదేశాల మేరకు సోమవారం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఓజో ఫౌండేషన్ సభ్యులు రవి, రాజు, మట్టపల్లి, సుధాకర్, మోతీలాల్, సాయిబాబా, రమేష్, గోపి, సైదులు, వినయ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరం వద్ద వంతెన నిర్మాణానికి రూ.3 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు రోడ్లు, భవనాల శాఖ ఏఈ సత్యనారాయణ సోమవారం విలేకరులకు తెలిపారు. అక్కడ కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్నదని, నిధులు మంజూరైన వెంటనే వంతెన పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే రూ.1.50 కోటిన్నర వ్యయంతో రత్నవరం నుంచి తెల్లబెల్లి మునగాల మండలం కోదండరామాపురం, ఆకుపాములకు వెళ్లే రహదారి బీటీ పనులను వర్షాలు తగ్గిన తర్వాత చేపట్టనున్నట్లు తెలిపారు.

భూమి పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

దురాజ్‌పల్లి : తన తల్లి నుంచి వారసత్వంగా రావాల్సిన భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని గరిడేపల్లి మండలం రాయినిగూడేనికి చెందిన గుండు బుచ్చిబాబు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఎస్.వెంకట్రావుకు వినతిపత్రం అందించారు. తన తల్లి పేరున రాయినగూడెం రెవెన్యూ పరిధిలో ఎకరం భూమి ఉండగా ఆరుగురు అన్నదమ్ములము సమానంగా పంపిణీ చేసుకోవాల్సి ఉందని అన్నారు. ఈ మేరకు పెద్దమనుషుల సమక్షంలో ఒప్పంద పత్రం కూడా రాసుకున్నామని తెలిపారు. కానీ చిన్నతమ్ముడైన గుండు హనుమంతు తహసీల్దార్‌ను ఆర్థిక ప్రలోభాలకు గురిచేసి భూమి పట్టా చేసుకున్నాడన్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించారని, విచారణ చే యాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు తెలిపారు.

ఆదర్శం.. గురుకుల గ్రంథాలయం

- అందుబాటులో 1700 పుస్తకాలు
- ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక బుక్స్ కలిగిన గురుకుల గ్రంథాలయం
- సమయం దొరికినప్పుడల్లా చదువుతూ విజ్ఞానం పెంచుకుంటున్న విద్యార్థినులు



సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థినులు



గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన జనరల్ నాలెడ్జ్ బోర్డు

నడిగూడెం : పాఠశాలలు, కళాశాలల్లోని గ్రంథాలయాల్లో సాధారణంగా ఆయా విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు సరిపడా పుస్తకాలు మాత్రమే ఉంటాయి. కానీ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏకంగా 1700 పుస్తకాలకు పైగా ఏర్పాటు చేశారు. దిన, వార పత్రికలతో పాటు ఆంగ్ల పత్రికలు కూడా అందుబాటులో ఉంచుతుండటంతో గ్రంథాలయం పుస్తకాల గనిగా మారింది. 1998లో ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలో మొత్తం 640 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. 5 నుంచి 10వ తరగతి వరకు 480 మంది, ఇంటర్మీడియట్‌లో 160 మంది విద్యార్థులు ఉన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 19 గురుకుల పాఠశాలల్లోనే నడిగూడెం గురుకుల పాఠశాల గ్రంథాలయంలో అత్యధికంగా పుస్తకాలు కలిగి ఆదర్శంగా నిలుస్తోంది.

గురుకులంలోని పుస్తకాలు ఇవే..

జనరల్ నాలెడ్జ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, అంబేడ్కర్, దళిత సాహిత్యం, గేమ్స్, స్పోర్ట్స్, యోగా, పాలిటెక్నిక్, నీట్ ప్రవేశ పరీక్ష పుస్తకాలు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు డిక్షనరీలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు లిటరేచర్, రెఫ్రెన్స్, తుంబి లాంటి కథల పుస్తకాలు, దిన పత్రికలు, మాస పత్రికలు, పక్ష పత్రికలు, ఆంగ్ల పత్రికలు అందుబాటులో ఉన్నాయి. అలాగే గోడలపై ప్రచురణలు, వాల్ రీడింగ్, ప్రత్యేక ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేశారు. కెరీర్ చార్ట్, వృత్తి నైపుణ్యం, వాక్చాతుర్యం, వ్యాసరచన, అనేక రకాల పుస్తకాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సమయం దొరికితే ఆటలతో పాటు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్నారు. ఈ పాఠశాల విద్యార్థినులు ఇక్కడి గ్రంథాలయంలో పుస్తకాలు చదివి ఉన్నత చదువులు చదువుతున్నారు.

దాతల సహకారంతో..

గురుకుల పాఠశాలలో దాతల సహకారంతో అనేక పుస్తకాలు ఏర్పాటు చేస్తున్నారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల సంస్థ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హెచ్.అరుణకుమారి, స్థానిక ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి, పలువురు ఉపాధ్యాయుల ఆర్థిక సహకారంతో పలు రకాలు పుస్తకాలు ఏర్పాటు చేశారు.

సమయం దొరికినప్పుడు చదువుతున్నా



మా పాఠశాలలోని గ్రంథాలయంలో అనేక రకాలు పుస్తకాలు ఉన్నాయి. సమయం దొరికినప్పుడల్లా గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదువుతాను. జనరల్ నాలెడ్జ్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇంకా పలు రకాల పుస్తకాలను చదువుతున్నాను.

– చిట్యాల వాసంతి, 10వ తరగతి విద్యార్థిని

1700 పుస్తకాలు ఉన్నాయి



బాలికల గురుకుల పాఠశాలలో ఎనిమిది ఏళ్లుగా గ్రంథాలయాధికారిగా పని చేస్తున్నాను. ఉమ్మడి జిల్లాలోని 19 పాఠశాలల్లో ఎక్కడా లేని విధంగా మా పాఠశాలలోని గ్రంథాలయంలో 1700 పుస్తకాలకు పైగా ఉన్నాయి. విద్యార్థుల తరగతులకు అనుగుణంగా పుస్తకాలను ఏర్పాటు చేశాం.

– చింతపల్లి నాగరాజు, గ్రంథాలయాధికారి

మౌలిక వసతులు కల్పిస్తున్నాం



పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

– సీహెచ్.ధనవిజయలక్ష్మి, ప్రిన్సిపాల్

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



తమ్మరలో ఆయిల్ పామ్ మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడరూరల్ : రైతులు వరితో పాటుగా ఆయిల్ పామ్ సాగు చేసి లాభాలు పొందాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తమ్మరలో ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన మొక్కలను పొలంలో నాటి మాట్లాడారు. ప్రభుత్వం పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ఉచితంగా మొక్కలు, సబ్సిడీ రుణాలు అందజేస్తుందని వివరించారు. ఈ మొక్కలను ఒక్కసారి నాటితే దాదాపుగా 20 ఏళ్లకు పైగా పంట దిగుబడి వస్తుందని అన్నారు. సంప్రదాయ పంటలకు బదులుగా తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడి, ధర ఉండే పంటలను సాగు చేయాలని అన్నారు. వ్యవసాయంలో అనేక రకాల ఆధునిక యంత్రాలు వచ్చాయని వాటితో కూలీల సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి అనిత, నాయకులు, పామాయిల్ సిబ్బంది ఉన్నారు.

సీసీ కెమెరాల పునరుద్ధరణకు సహకరించాలి

- కోదాడ డీఎస్పీ ప్రకాశ్



డీఎస్పీతో సమావేశమైన సెక్యూరిటీ కమిటీ సభ్యులు

కోదాడ : పట్టణంలో సీసీ కెమెరాల పునరుద్ధరణకు కోదాడ సెక్యూరిటీ కమిటీ సహకారం అందించాలని కోదాడ డీఎస్పీ ప్రకాశ్ కోరారు. కోదాడ పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై సోమవారం డీఎస్పీ కార్యాలయంలో సెక్యూరిటీ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సెక్యూరిటీ కమిటీ సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చాలా వరకు పనిచేయడం లేదని, వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ వద్ద లక్షా 70 వేల రూపాయల నిధులు ఉన్నాయని, వాటికి మరికొన్ని జమచేసి కెమెరాల ఏర్పాటుకు సహకరిస్తామని తెలిపారు. త్వరలో మరోసారి సమావేశం నిర్వహించి పూర్తిస్థాయిలో కార్యచరణ చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ రాము, కమిటీ సభ్యులు ముడియాల భరత్‌రెడ్డి, డాక్టర్ శ్రీపతిరెడ్డి, మేళ్లచెరువు కాశీనాథం, డాక్టర్ సుబ్బారావు, కొమరగిరి రంగారావు పాల్గొన్నారు.

డాంబర్ ప్లాంట్ పరిశీలన



పాలెఅన్నారం పరిధిలోని డాంబర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

చిలుకూరు : మండలంలోని పాలెఅన్నారం పరిధిలో కళాశాలల దగ్గరలో ఉన్న డాంబర్ ప్లాంట్ రన్నింగ్ సమయంలో వస్తున్న పొగతో జరిగే అనార్థలపై 'కమ్మేస్తున్న కాలుష్యం'అనే శీర్షికతో ఈ నెల 24వ తేదీన సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ స్పందించారు. సోమవారం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి ప్లాంట్‌ను పరిశీలించారు. డాంబర్ ప్లాంట్ నుంచి పొగ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్లాంట్ ఏర్పాటుకు అనుమతులు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ప్లాంట్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మంజుల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెట్టు నరికివేతపై గ్రామస్తుల ఆగ్రహం



పెంచికల్‌దిన్న పీహెచ్‌సీలో నరికిన చెట్టు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి పనులకు అడ్డు వస్తున్నాయని కాంట్రాక్టర్ పచ్చని చెట్టుని నరకడంపై సోమవారం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా 10 ఏళ్ల క్రితం నాటిన మొక్క పెద్ద వృక్షంగా మారిందని, దానిని నరికి అమ్మకానికి సిద్ధం కావడం ఏంటని ప్రశ్నించారు. ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు అడ్డం వస్తే స్థానిక సర్పంచ్‌కి సమాచారం అందించంతో పాటు గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు మాత్రమే చెట్టును నరికివేయాలని, కానీ ఇష్టారాజ్యంగా ఎలా నరికివేస్తారని ధ్వజమెత్తారు. చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ విషయంపై వైద్యాధికారి సీతామహాలక్ష్మిని వివరణ కోరగా తాను ఆసుపత్రికి వెళ్లేసరికి చెట్టును నరికి ముక్కలు చేశారని, అది చూసి నేనే ఆశ్చర్యపోయానని పేర్కొన్నారు. చెట్టు ఎందుకు నరికారని ప్రశ్నిస్తే అభివృద్ధి పనులకు అడ్డువస్తుందనే నరికివేశామని కాంట్రాక్టర్ చెప్పాడని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ సరిత, ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు చెప్పారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం



పెచ్చులూడుతున్న అంగన్‌వాడీ భవనం

మునగాల : మండలంలోని కొక్కిరేణిలో గల అంగన్‌వాడీ కేంద్రం– 2 భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే భవనం పైభాగం చమ్మగిల్లుతూ పెచ్చులూడుతోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే భవనానికి మరమ్మతులు చేయించాలని గ్రామానికి చెందిన పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి కోరారు.

తలుపులు పగులగొట్టి చోరీ

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని బి.రామిరెడ్డి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. బాధితుడు సోమవారం ఉదయం 11 గంటల సమయంలో తన పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటం గమనించిన అతను ఇట్లోకి వెళ్లి చూడగా కొంత నగదు, బంగారం దోచుకెళ్లినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

చిలుకూరు : రైతులు పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు అన్నారు. సోమవారం చిలుకూరులోని పశువైద్యశాలలో పశువులకు గాలికుంట టీకాలు వేసే కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 12 వేల పశువులకు ఆగస్టు 31 వరకు టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారులు తెలి పారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు వీరా రెడ్డి, శ్రీనివాస్, ఆనంద్ పాల సొసైటీ చైర్మన్ నెల్లూరి నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, సిబ్బంది ఉపేందర్, వెంకన్న, శ్రీవాణి, వీరబాబు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వాసవి, వనిత క్లబ్‌ల అధ్యక్షులు కొత్త లక్ష్మణ్, వీరవెల్లి శ్రీలత అన్నారు. సోమవారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకూర్తి గాయత్రి ఆదేశాల మేరకు 'విద్యాసేవా– పకృతి సేవా' అనే కార్యక్రమంలో భాగంగా చింతబండ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసి పాఠశాల ఆవరణలో అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొదమగుండ్ల సరిత, వాసవి, వనిత ఇంటర్నేషన్ పొగ్రాం కోఆర్డినేటర్ గరిణె అరుణ, జిల్లా ఇన్‌చార్జ్ కందిబండ వాసంతి, పాలిశెట్టి సంధ్య, ఈగ భాగ్యలక్ష్మి, శ్రీనివాస్‌రావు, గోపాలకృష్ణ, నటరాజ్, రామ్మూర్తి, అనసూర్య, బాలరాజు, జ్యోతి తదితరులు ఉన్నారు.

పోకల లింగయ్యకు నివాళి

గరిడేపల్లి : పొనుగోడు గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పోకల వెంకటేశ్వర్లు తండ్రి పోకల లింగయ్య మృతి చెందారు. సోమవారం పలు పార్టీల నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్, రైతు సంఘం నాయకులు పోకల వెంకటేశ్వర్లు, షేక్ యాకూబ్, బిల్లా కనకయ్య, కడియాల అప్పయ్య, నట్టె సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

హుజూర్‌నగర్‌రూరల్ : మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ ఆరోపించారు. సోమవారం మండల పరిధిలోని శ్రీనివాసపురంలో సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చి 77 ఏళ్లు దాటినా మహిళలను వివస్త్రలను చేసి నగ్నంగా ఊరేగించడం దేశానికి సిగ్గుచేటన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలు ఆగాలంటే వెంటనే ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మాడూరి నర్సింహాచారి, మండల కమిటీ సభ్యురాలు తంగెళ్ల వెంకటచంద్ర, శాకమూరి శశికళ, సైదమ్మ, మల్లమ్మ, అన్నపూర్ణ, గోపరాజు, కృష్ణారావు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

నేరేడుచర్ల : రహదారులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నేరేడుచర్ల ఎస్ఐ పచ్చిపాల పరమేష్ అన్నారు. పట్టణంలోని ప్రధాన విధుల్లో రోడ్లను ఆక్రమించడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో సోమవారం ప్రధాన కూడళ్లలో తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. చిరు వ్యాపారులు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఆర్టీసీ బస్సులను నిర్దేశించిన స్థలంలోనే నిలుపుదల చేయాలన్నారు. ఈ విషయంపై ఆర్టీసీ డీఎంలతో మాట్లాడినట్లు తెలిపారు. బస్సులను ఇష్టారాజ్యంగా నిలుపుదల చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది మధు, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, నటరాజ్ ఉన్నారు.

పూనం లింగన్న ఆశయాలు సాధించాలి

కోదాడఅర్బన్ : పట్టణంలోని లాల్ బంగ్లాలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర మాజీ కమిటీ సభ్యుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ కార్యదర్శి పూనం లింగన్న 4వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లింగన్న ఆశయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వక్కవంతుల నర్సింహారావు, విజయ్, మైసయ్య, గోపి, వీరబాబు, నర్సింహారావు, సలీం, ఖాసీం, నాగేశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

2న రెడ్‌క్రాస్ ఎన్నికలు

కోదాడ : కోదాడలోని ఎంపీడీఓ కార్యాలయంలో గల సెమినార్ హాల్‌లో ఆగస్టు 2వ తేదీన ఉదయం 11 గంటల నుంచి కోదాడ యూనిట్ రెడ్‌క్రాస్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోదాడ యూనిట్‌లో సభ్యులుగా ఉన్న వారు ఈ ఎన్నికల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

నిషేధిత జాబితాలో చేర్చాలి

హుజూర్‌నగర్ : పట్టణంలో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లను నిషేధిత జాబితాలో చేర్చాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కస్తాల శ్రవణ్, కౌన్సిలర్లు కోతి సంపత్ రెడ్డి, జక్కుల వీరయ్య అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 50 ఎకరాల్లో అక్రమ వెంచర్లు ఏర్పాటు చేయడంతో మున్సిపాలిటీకి రావాల్సిన 10 శాతం భూమి రాకుండా పోతుందన్నారు. తద్వారా కోట్ల రూపాయల నష్టం జరుగుతోందని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ కమిషనర్, అదనపు కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశామన్నారు.. త్వరలో కలెక్టర్, డీటీసీపీ, సీడీఎంఏలను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

సమన్వయంతో సంఘాలు అభివృద్ధి



కాన్వాసింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సన్మానించిన లారీ అసోసియేషన్ నాయకులు

కోదాడఅర్బన్ : లారీ అసోసియేషన్, ప్యాడీ కాన్వాసింగ్ అసోసియేషన్ సభ్యుల సమన్వయంతో సంఘాలను బలోపేతం చేసుకుందామని పలువురు లారీ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ప్యాడీ కాన్వాసింగ్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు పిన్నపురెడ్డి వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొత్త రాజారావు, ఉపాధ్యక్షుడు అగిర్ మదన్‌మోహన్, సహాయ కార్యదర్శి తాళ్లూరి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి అప్పన సతీష్, కార్యవర్గ సభ్యులను సోమవారం పట్టణంలోని కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రామారావు, వెంకటనారాయణ, ప్రసాద్, నాగేశ్వరరావు, నరసరాజు, నాగిరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులు హేయమైన చర్య



హుజూర్‌నగర్‌లో కోర్టు బయట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్ : ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. విజయవాడకు చెందిన న్యాయవాది విటల్ బాబును ఆంధ్రప్రదేశ్‌లోని అద్దంకిలో ఆయన ప్రత్యర్థులు దారుణంగా హత్య చేయడాన్ని ఖండిస్తూ సోమవారం హుజూర్‌నగర్‌లో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో న్యాయవాదులపై దేశవ్యాప్తంగా భౌతిక దాడులు, హత్యలు జరుగుతుండడం హేయమైన చర్య అని అన్నారు. అనంతరం తమ విధులు బహిష్కరణకు సహకరించాలని కోరుతూ సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్‌లకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, సీహెచ్.యాదగిరి, బి.ప్రవీణ్ కుమార్, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, సురేష్, మహేష్, జక్కుల వీరయ్య, రామ లక్ష్మారెడ్డి, సైదా హుస్సేన్, పసుపులేటి వీరయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం లేకుండా చూడాలని ఆర్డీఓకు వినతి

హుజూర్‌నగర్ : దళితబంధు పథకం అమలులో, లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెమిడాల రాజు, కె.సత్యావతి కోరారు. అర్హులైన వారందరికీ దళితబంధు పథకం వర్తింపజేయాలని కోరుతూ సోమవారం హుజూర్‌నగర్‌లో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితబంధుకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించి కలెక్టర్‌ల ద్వారా అర్హులను ఎంపిక చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ లోన్‌లకు నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేదలకు జీఓ నంబర్ 58, 59ల ద్వారా పట్టాలు అందజేయాలని కోరారు.

కార్మికులపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి



గరిడేపల్లి : కార్మికులకు మద్దతుగా అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు



హుజూర్‌నగర్‌రూరల్ : మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, జీపీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు దనియాకుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న జీపీ కార్మికులనుద్దేశించి వారు మాట్లాడారు. జీఓ నంబర్ 60 ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హుస్సేన్, జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ హుసన్‌మియా, కొండల్, రత్నం, యల్లమ్మ, నాగరాజు, అంజయ్య, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మఠంపల్లి : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దనియాకుల శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా నాయకుడు షేక్ యాకూబ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెకు వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్‌మియా, పంచాయతీ సిబ్బంది యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, ఎం.మైసయ్య, మోతీలాల్, పిచ్చయ్య, నరసింహారెడ్డి, దేవదానం, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

గరిడేపల్లి : గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్, మండల అధ్యక్షుడు అమరవరపు వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్మికుల సమ్మెకు బీఎస్పీ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపి అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపు మేరకు గ్రామ పంచాయతీ కార్మికులకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులను ముఖ్యమంత్రి పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండమీది నర్సింహారావు, బొల్లగాని సుబ్బుగౌడ్, రవి, జీలకర్ర రామస్వామి, మహిళా అధ్యక్షురాలు రమణ, గోవర్ధన్, నాగమణి, పవన్, నాగార్జున్ పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం 26వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం అధ్యక్షుడు కట్టెకోల శ్రీనివాస్‌రావు, జీపీ కార్మికులు తిరగమళ్ల వెంకటేశ్వర్లు, జిల్లా వెంకటి, షేక్ జాకీర్‌హుస్సేన్, వడ్రాణపు తిరపయ్య, పట్టపాక నాగేశ్వరరావు, దానియా, సైదయ్య, నాగేంద్రబాబు, శ్రీను పాల్గొన్నారు.

కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలి

మునగాల : తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని పంచాయతీ కార్మికులు సోమవారం మునగాల తహసీల్దార్ జవహర్‌ను కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు బండారు గుర్వమ్మ, మండల నాయకులు మరియమ్మ, పార్వతి, రాములమ్మ, మౌనిక, మామిడి వెంకన్న, శ్రీను, రఘు, బజార్, ముత్తయ్య, వీరబాబు, వీరయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మోతె : తమ సమస్యలు పరిష్కరించాలని గత 26 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడం అన్యాయమని పారిశుద్ధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు చిట్టాల రవిచంద్ర అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సమ్మెలో భాగంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పి.యాదగిరికి అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. సోమవారం సమ్మెకు రైతు సమన్వయ సమితి జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి లింగారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు నాగరాజు, వెంకన్న, సుభాని, పీరయ్య, నాగరాజు, పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోదాడరూరల్ : గత 26 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నంబూరి సూర్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోదాడలో జీపీ కార్మికుల సమ్మెకు ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సొంపంగు రాధాకృష్ణ, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పూసపాటి ముత్తయ్య, ఉపాధ్యక్షుడు రామారావు, నాయకులు కరీం, కొండలు, బాబు, బోడ సైదులు పాల్గొన్నారు.